క్లుప్తంగా

ధైర్యలక్ష్మికి పంచామృత అభిషేకాలు



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: ప్రముఖ భారతీయ తత్వదర్శన కేంద్రమైన శ్రీక్షేత్రంలోని అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువైన ధైర్యలక్ష్మి అమ్మవారికి శుక్రవారం పంచామృత అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. దేవాలయ అర్చకులు చామర్తి శ్రీనివాస ఆచార్యులు, చామర్తి రమేష్ ఆచార్యులు వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉత్సవంలో దేవాలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేలకు మేలు



రైతులకు నవధాన్యాల కిట్‌లను అందిస్తున్న ఉత్తర కోస్తా ఆర్‌టీఎల్ ప్రకాష్, తదితరులు

డెంకాడ: నవధాన్యాల సాగుతో నేలకు మేలు జరుగుతుందని ఉత్తర కోస్తా ఆర్‌టీఎల్ ప్రకాష్ అన్నారు. మండలంలోని సింగవరం ఆర్‌బీకేలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో రైతులకు నవధాన్యాల కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నవధాన్యాలు సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్‌టీఓ హేమసుందర్, ఏఈఓ రామకోటి, ఏపీసీఎన్ఎఫ్ సీఏ గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

22 మంది జూదరుల అరెస్ట్

నెల్లిమర్ల: మండలంలోని చంద్రంపేట గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై నెల్లిమర్ల పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఎస్సై పి. నారాయణరావు ఆధ్వర్యంలో పోలీసులు 24 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 5 కోడి పుంజులు, రూ 32, 130 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే జూదరులకు చెందిన 3 కార్లు, 3 ద్విచక్ర వాహనాలను కూడా స్వాధీనపర్చుకున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు దాడి చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మలేరియా నిర్మూలనపై అవగాహన



చీడివలసలో నిల్వనీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

కొత్తవలస: మండలంలోని వియ్యంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి చీడివలస గ్రామంలో శుక్రవారం మలేరియా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ఇ.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఆస్పత్రి సిబ్బంది గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ప్రతీ శుక్రవారం డ్రైడేను పాటిద్దామని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను అంతం చేద్దామని నినాదాలు చేశారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓలు నర్సింహరావు, తిరుపతిరావు, ఈశ్వరరావు, ఆరోగ్య సహాయకులు సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ 516బీ అభివృద్ధికి మేం వ్యతిరేకం కాదు

లక్కవరపుకోట: అరకు–విశాఖపట్నం (516 బీ) జాతీయ రహదారి అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వ్యతిరేకం కాదని, కాకపోతే భూములు కోల్పోయిన రైతులకు వంద శాతం పరిహారం ఇవ్వాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు అన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు అధ్యక్షతన మండల కేంద్రంలోని చెరుకు కాటా వద్ద జాతీయ రహదారి భూ నిర్వాసితుల కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధరాజు రాంబాబు మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు 2013 భూ సేకరణ చట్టంలో ఉన్న నిబంధనలను అనుసరించి పరిహారం చెల్లించాలని, ఓపెన్ మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న ధరకు సమానంగా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రోడ్డుకు ఇరుపక్కల గల చిన్న చిన్న బడ్డీలు, చిరువ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలన్నారు. అనంతరం జాతీయ రహదారి భూ నిర్వాసితుల పోరాట కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్, కో కన్వీనర్‌గా చల్లా జగన్, గొంప కృష్ణమూర్తితో పాటు 13 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ, సీఐటీయూ మండల అధ్యక్షుడు తరిణి వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 48వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: ఎటువంటి అవినీతికి తావులేకుండా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ప్రభుత్వానికి శ్రీరామ రక్ష అని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 48వ డివిజన్ గాజులరేగలో శుక్రవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బందితో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఒక్కో ఇంటికి నాలుగేళ్ల కాలంలో సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు మాట్లాడుతూ, నగరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పట్ల ప్రజాస్పందన అనూహ్యంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి ఫలాలను నేరుగా ప్రజల ఖాతాలకే అందించడంతో అవినీతిరహిత పాలన సాగుతోందన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఎటువంటి సమస్యలు లేకుండా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల కృషి చేస్తున్నారని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేకే ప్రతిపక్ష టీడీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సచివాలయ కన్వీనర్ కరణపు ముత్యాలరావు (సన్నీ) మాట్లాడుతూ, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి తద్వారా ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఇన్‌చార్జ్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ, జోనల్ ఇన్‌చార్జ్ బోడసింగి ఈశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు మధు, తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ.. సంక్షేమాన్ని వివరిస్తూ..

విజయనగరం: గడప గడపకూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ... కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపుతూ ముందుకు సాగారు నగర డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయయాదవ్. నగరంలోని 33వ డివిజన్ పరిధి నాగోజీపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఎంత లబ్ధి చేకూరిందీ వివరించారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధికి శాసనసభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి చేస్తున్న కృషిని తెలియజేశారు. అటు రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి.. ఇటు నియోజకవర్గంలో శాసనసభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి సారథ్యంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. అవినీతికి, దళారీ వ్యవస్థకు తావులేకుండా నేరుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్పొరేటర్ జీవీ రంగారావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పనితీరు పట్ల ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్‌లు బొద్దాన అప్పారావు, బాల బ్రహ్మరెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ ఎస్. భార్గవి, స్థానిక నాయకులు, కన్వీనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న నగర డిప్యూటీ మేయర్లు

గడప గడపకు.. అనూహ్య స్పందన



ప్రభుత్వ సంక్షేమ పాలనను లబ్ధిదారులకు వివరిస్తున్న ఉప సభాపతి కోలగట్ల

విజయనగరం రూరల్: మండలంలోని జొన్నవలసలో నాలుగో రోజైన శుక్రవారం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఎమ్మెల్యే కోలగట్ల, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మజ్జి అప్పారావు మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే వీరభద్రస్వామికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, సర్పంచ్ కంది రమాదేవి, ఎంపీడీఓ గంటా వెంకటరావు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో నూతన సంస్కరణలు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



విద్యార్థులకు నగదు పురస్కారాలు అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం రూరల్: విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించి నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపకలను ఇచ్చి విద్యార్థులను సత్కరిస్తున్నట్లు చెప్పారు. జొన్నవలస ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఇంటర్‌లో నియోజకవర్గస్థాయిలో ప్రతిభ కనబరిచిన పి.దేవి, పి. భవాని, జై మహేష్, బి మణికంఠలకు.. పదో తరగతి ఫలితాల్లో రాణించిన అల్లం రిసిత్‌రెడ్డి, యు. అప్పలనాయుడు, వి.నందకిషోర్, టి. ప్రశాంతిలకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ.5 వేలు చొప్పున అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కోలగట్ల మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచుతూ ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్న జగన్ మోహన్‌రెడ్డి ఆదర్శప్రాయుడని కొనియాడారు. ప్రస్తుతం ర్యాంకులు సాధించిన విద్యార్థులను మిగిలిన వారు ఆదర్శంగా తీసుకుని, మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. నగర మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాల కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రైవేటుకు దీటుగా సర్కార్ పాఠశాలలను మార్చిన ఘనత జగన్ మోహన్‌రెడ్డిదేనన్నారు. మండల పరిషత్ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు మాట్లాడుతూ, విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చి దేశంలోనే ఉత్తమ విద్యా విధానాన్ని రూపొందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డి అభినందనీయుడన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, సర్పంచ్ కంది రమాదేవి, ఎంపీడీఓ గంటా వెంకటరావు, మజ్జి అప్పారావు, ఎంఈఓ రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈపు విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు సన్మానం



సత్కారం పొందిన విద్యార్థులతో సర్పంచ్ రమణి, తదితరులు

డెంకాడ: మండలంలోని జొన్నాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులను జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సత్కరించారు. మొదటి స్థానం సాధించిన సువ్వాడ సమీర్‌కి రూ.3 వేలు, ద్వితీయ స్థానం సాధించిన గొలగాని హేమంత్‌కుమార్ రూ.2 వేలు, తృతీయ స్థానం సాధించిన పతివాడ శ్రావ్యకు రూ.వెయ్యి చొప్పున సర్పంచ్ కోరాడ రమణి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు దేవి, హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాంపస్ చాలెంజ్‌కు సోలార్ పవర్ ప్రాజెక్ట్



శిలాఫలకం ప్రారంభించిన మాక్సిమస్ ప్రతినిధులు, ఏపీఈపీడీసీఎల్ జీఎం మాషిలామణి, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ జంక్షన్‌లో గల క్యాంపస్ చాలెంజ్ దివ్యాంగుల పునరావాస కేంద్రానికి మాక్సిమస్ ఆర్క్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో 54 కిలోవాట్ల సోలార్ పవర్ ప్రాజెక్ట్ వితరణగా అందజేశారు. ఈమేరకు వితరణకు సంబంధించిన శిలాఫలకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. రూ. 34 లక్షల ప్రాజెక్ట్ వల్ల క్యాంపస్‌కు ఏడాదికి రూ. 5 లక్షల వరకు విద్యుత్ బిల్లు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో మాక్సిమస్ ఆర్క్ లిమిటెడ్ ప్రతినిధులు రమేష్, నారాయణ ప్రసాద్, కృష్ణప్రసాద్, ఏపీఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ మాషిలామణి, సాయికొరియన్ ప్రతినిధులు శేఖర్‌బాబు, వినోద్‌బాబు, క్యాంపస్ చాలెంజ్ డైరెక్టర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సన్మానిస్తున్న జెడ్పీటీసీ సన్యాసినాయుడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ఇటీవల పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు మాట్లాడుతూ, ప్రభుత్వం సమకూరుస్తున్న వనరులను వినియోగించుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు వి. జ్ఞానేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు మోయిద అక్కోజీ, చంద్రంపేట ఎంపీటీసీ సభ్యుడు వాల్లె అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సమస్యల పరిష్కారానికే వెల్ఫేర్ డే



సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ఎం. దీపిక తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో పలువురు సిబ్బంది సమస్యలు తెలుసుకుని, అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, సిబ్బంది అభ్యున్నతికి తామెప్పుడూ ముందుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక పంపిణీ



విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందిస్తున్న నడిపేన, తదితరులు

విజయనగరం రూరల్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 16వ వార్డులోని జమ్ము ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, విద్యా దీవెన, వసతి దీవెన, ఆంగ్ల మాధ్యమం, జగనన్న ఆణిముత్యాల పథకాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి



వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి నానికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న యువనేత బడ్డుకొండ ప్రదీప్ నాయుడు

నెల్లిమర్ల రూరల్: జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్న గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని వైఎస్సార్‌సీపీ యువనేత, ఎమ్మెల్యే తనయుడు బడ్డుకొండ ప్రదీప్‌నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని గరికిపేటలో ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన క్రీడాకారిణి బెల్లాన నాని, కోచ్ బూసరి రవిలను శుక్రవారం అభినందించి రూ. పది వేలను అందజేశారు. ఈ సందర్భంగా బడ్డుకొండ ప్రదీప్‌నాయుడు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతానికి చెందిన బెల్లాన నాని జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు. అలాగే భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కాగా క్రీడాకారిణి బెల్లాన నానికి గరికిపేటకు చెందిన బెల్లాన సత్యనారాయణ రూ.10 వేలు, నగర పంచాయతీ 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ 5000 రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, కొండగుంపాం సర్పంచ్ పతివాడ అప్పన్న, తుమ్మలపేట పీఏసీఎస్ అధ్యక్షుడు కోట్ల పైడినాయుడు, నగర పంచాయియతీ కౌన్సిలర్ మొయిద శ్రీనివాస రావు, నాయకులు పాండ్రంకి సత్యనారాయణ, గుంటమాని రాజబాబు, ఉమా, తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆనందోత్సాహం

- అయ్యకోనేరు దక్షిణ గట్టు ప్రాంతంలో 52 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ



ఇళ్ల పట్టాలు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ఎన్నో ఏళ్ల నాటి కల సాకారం కావడంతో అయ్యకోనేరు దక్షిణ గట్టు ప్రాంతవాసుల్లో ఆనందోత్సాహం వెల్లివిరిసింది. 52 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయడంతో హర్షాతిరేకాలు మిన్నంటాయి. శుక్రవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొని లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. దక్షిణ గట్టు ప్రాంతంలో 40 మందికి, లంకవీధి ప్రాంతంలో 12 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయడంతో వారంతా ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, చాలా ఏళ్లుగా అయ్యకోనేరు దక్షిణ గట్టు ప్రాంతంలో నివాసముంటూ పట్టాలు లేకపోవడంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయన్నారు. చెరువు సుందరీకరణలో భాగంగా తాము పర్యటించినప్పుడు ఈ ప్రాంత వాసుల ఇబ్బందులను గమనించి పట్టాల మంజూరుకు హామీ ఇచ్చానన్నారు. అనుకున్న విధంగానే ఎక్కడా అవినీతి లేకుండా ఇళ్ల పట్టాలు మంజూరు చేసిన ఘనత తమదేనని స్పష్టం చేశారు. గతంలో తాను శాసనసభ్యుడిగా ఉన్న సమయంలో సుంకరవీధిలోని గోశాలలో అనేకమందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని గుర్తు చేశారు. అలాగే ముచ్చివాని చెరువు, నాగోజీపేట ప్రాంతవాసులకు కూడా ఇళ్ల పట్టాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రసాదరావు, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, జోనల్ ఇన్‌చార్జ్‌లు కోలగట్ల కృష్ణారావు, సంగంరెడ్డి బంగారునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు జోల మన్మథకుమార్, వివిధ ట్రస్ట్ బోర్డు మెంబర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.53 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విజయనగరం: నగరంలో వివిధ డివిజన్‌లలో రూ.53 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధికి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపనలు చేశారు. 6వ డివిజన్‌లోని సింగపూర్ సిటీ వద్ద 40 లక్షల రూపాయలతో కాలువ నిర్మాణానికి.. 17, 18 డివిజన్‌లలో 13 లక్షల రూపాయలతో సీసీ రహదారులు, కాలువల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పనే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా 53 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామన్నారు. డిప్యూటీ మేయర్ లయాయాదవ్ మాట్లాడుతూ, నగర అభివృద్ధే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు ఆశపు సుజాత, ఆల్తి సత్యకుమారి, మీసాల రమాదేవి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారునాయుడు, బోడసింగి ఈశ్వరరావు, బొద్దాన అప్పారావు, కో ఆప్షన్ సభ్యురాలు పిల్లా పద్మావతి, మాజీ వైస్ చైర్‌పర్సన్ లెంక వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

విజయనగరం

9951602843

Office mail : vzmadvt@gmail.com